క్లుప్తంగా

నేటి నుంచి కొత్త మద్యం షాపులు


ఎక్సైజ్ సీఐ సునీల్ కుమార్

నర్సీపట్నం : కొత్త మద్యం షాపులు బుధవారం నుంచి అమల్లోకి వస్తాయని ఎక్సైజ్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. మద్యం షాపుల టెండర్ల ద్వారా ప్రభుత్వానికి రూ.22.12 కోట్ల ఆదాయం సమకూరిందన్నారు. నర్సీపట్నం సర్కిల్ పరిధిలో 21మద్యం షాపులకు లైసెన్స్‌లు పొందిన వారు యథావిధంగా వ్యాపార కార్యకలాపాలు సాగించుకోవచ్చునని సీఐ తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మద్యం విక్రయాలు జరపాలని సీఐ పేర్కొన్నారు.

స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఏర్పాటు


షాపులకు స్మార్ట్ మీటర్లు అమర్చుతున్న విద్యుత్ సిబ్బంది

మాకవరపాలెం : స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఏర్పాటు ముమ్మరంగా సాగుతోంది. మండల వ్యాప్తంగా ఉన్న 31 పంచాయతీల పరిధిలో సుమారు 17వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. మండల కేంద్రంలో మంగళవారం వివిధ దుకాణాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేశారు. అయితే 17వేల కనెక్షన్లలో ముందుగా 5 వేల వాణిజ్య అవసరాలకు సంబంధించిన మీటర్లు, ప్రభుత్వ కార్యాలయాలకు ఉన్న 400 మీటర్లను మార్పు చేస్తున్నామని విద్యుత్‌శాఖ ఏఈ బాలకృష్ణ తెలిపారు. ఇవి పూర్తయిన అనంతరం మిగినవి మార్పు చేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

పంచాయతీ కార్యదర్శుల బాధ్యతల స్వీకరణ

నాతవరం : మండలానికి బదిలీపై వచ్చిన ముగ్గురు పంచాయతీ కార్యదర్శులు మంగళవారం విధుల్లో చేరారు. నక్కపల్లి మండలంలో పనిచేస్తున్న ఎం.లోవరాజు చెర్లోపాలెం పంచాయతీ కార్యదర్శిగా చేరారు. చింతపల్లి మండలంలో పనిచేసే కార్యదర్శులు జుర్రా స్వామి నాయుడు ఎస్.బి.పట్నం పంచాయతీ కార్యదర్శిగా, లోచల చిన్నంనాయుడు వై.బి.పట్నం పంచాయతీ కార్యదర్శిగా చేరారు. వారు ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తిని మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో 31 గ్రామ పంచాయతీలకు బదిలీల్లో భాగంగా 21 పంచాయతీలకు కొత్త పంచాయతీ కార్యదర్శులు రానున్నారు.

ఎస్సీ శ్మశాన వాటికలో తుప్పల తొలగింపు


ఎస్సీ నేతలతో శ్మశానవాటికను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత రమణ

చీడికాడ : మంచాలలో తన సొంత నిధులతో గ్రామానికి చెందిన ఎస్సీల శ్మశాన వాటికలో తుప్పలు తొలగించినట్టు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత పాటూరి రమణ తెలిపారు. వివరాల్లోకి వెళితే ఎస్సీ కాలనీకి చెందిన రొంగలి దేముడు ఉదయం గుండెపోటుతో మరణించాడన్నారు. అయితే దహన సంస్కారాలు నిర్వహించేదుకు ఎస్సీల శ్మశానవాటికలో జంగిల్స్ ఇబ్బంది ఉండడంతో గ్రామానికి చెందిన ఎస్సీ నాయకులు కోరిన మీదట తన సొంత నిధులతో శ్మశాన వాటికలో జంగిల్స్ తొలగించినట్టు చెప్పారు

డీఫారం భూముల సర్వే


ఎల్.పొన్నవోలులో గల భూములను పరిశీలిస్తున్న మండల సర్వేయర్ జగదీష్

మాడుగుల రూరల్ : ఎల్.పొన్నవోలు గ్రామంలో ఎన్నో ఏళ్ల నుంచి రైతుల సాగులో ఉన్న సర్వే నంబర్ 47లో గల భూమికి పట్టాలను అందించాలని సీపీఐ నాయకుడు సీతా బెన్నం నాయుడు ఇటీవల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతిపత్రం అందించారు. దీంతో మంగళవారం పొన్నవోలు గ్రామంలో గల సర్వే నంబర్ 47లో గల భూమిని మండల సర్వేయర్ జగదీష్ పరిశీలించారు. సాగులో ఉన్న రైతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

రైవాడ జలాశయంపై ప్రభుత్వం శీతకన్ను

- తుప్పలు, డొంకలతో నిండిన పరిసరాలు
- గుంతలమయంగా జలాశయం గట్టుపై రహదారి
- అధికారులకు సైతం తప్పని అవస్థలు


జలాశయం లోపలి భాగంలో ఏపుగా ఎదిగిన తుప్పలు


గుంతల మయంగా మారిన రైవాడ జలాశయం గట్టుపై రహదారి


రైవాడ జలాశయం గట్టుపై రహదారిని మూసేసిన తుప్పలు

దేవరాపల్లి : రైవాడ జలాశయం అభివృద్ధిపై టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. ఖరీఫ్ పంటల సాగు పనులు ప్రారంభానికి ముందే జలాశయంతో పాటు పంట కాలువల మెయింటెనెన్స్ పనులు చేపట్టడం ఆనవాయితీ. చంద్రబాబు సర్కార్ గద్దెనెక్కి నాలుగు నెలలు కావస్తున్నా ఇరిగేషన్ ప్రాజెక్టుల అభివృద్ధిపై దృష్టి సారించలేదు. ఫలితంగా దేవరాపల్లి మండలంలోని రైవాడ జలాశయం పరిసరాలు చిట్టడవిని తలపిస్తుంది. జలాశయం గట్టుపై ఇరువైపులా తుప్పలు, డొంకలు విపరీతంగా పెరిగిపోయి రహదారి సైతం కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో జలాశయం సందర్శనకు వచ్చి పర్యాటకులు, ప్రజలు, రైతులతో పాటు జలాశయంపై చేపల వేట సాగించే మత్స్యకారులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జలాశయం గట్టుపై భారీ గుంతలు

జలాశయంపై విధులు నిర్వర్తించే ఇరిగేషన్ అధికార్లు సైతం తుప్పలు, డొంకలు ఏపుగా ఎదగడంతో తీవ్ర భయాందోళనలు చెందుతున్నారు. జలాశయం గట్టుపై రహదారి సైతం అధ్వానంగా తయారైంది. సుమారు మూడు కిలోమీటర్ల మేర పొడవున్న గట్టుపై అడుగడుగునా భారీ గుంతలు పడటంతో రాకపోకలు సాగించేందుకు స్థానిక ప్రజలు, రైతులు, మత్స్యకారులు నరకయాతన పడుతున్నారు. కనీసం ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లే పరిస్థితి లేక పోవడంతో ప్రభుత్వ తీరుపై స్థానికులు, రైతులు మండిపడుతున్నారు.

గేట్లకు కొరవడిన మెయింటెనెన్స్ పనులు

జలాశయం గేట్లకు మెయింటెనెన్స్ పనులు చేపట్టక పోవడంతో నీటి విడుదల సమయంలో సక్రమంగా పనిచేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రైవాడ జలాశయానికి 15,344 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ జలాశయంపై ఆధారపడి 10 వేల మందికి పైబడి రైతులు ఆధారపడి ఉన్నారు. రైవాడ జలాశయానికి ఇంతటి దారుణ పరిస్థితి మునుపెన్నడూ లేదని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జలాశయంపై తుప్పలు, డొంకలు తొలగించడంతో పాటు రహదారిని ఎప్పుడు బాగు చేస్తారో అని రైతులు ఎదురు చూస్తున్నారు.

సర్పంచ్‌లను అగౌరవపరచడం తగదు

- ఎంపీపీ సుర్ల రాజేశ్వరి
- వాడివేడిగా మండల సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుర్ల రాజేశ్వరి


సమావేశంలో ఏకరువు పెడుతున్న సర్పంచ్‌లు

నర్సీపట్నం : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సర్పంచ్‌లకు సముచిత గౌరవం కల్పించామని ఎంపీపీ సుర్ల రాజేశ్వరి పేర్కొన్నారు. ఎంపీపీ అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సర్పంచ్‌లకు సమాచారం ఇవ్వకుండా అధికారులు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని, సర్పంచ్‌లను అగౌరవ పర్చటం సరికాదని ధర్మసాగరం, గురంధరపాలెం వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు గొంప కన్నయ్యనాయుడు, శానపతి వెంకటరత్నం సభలో అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై మీ ప్రభుత్వంలో అలాగే చేశారని గబ్బాడ సర్పంచ్ రాజేశ్వరి అనడంతో సర్పంచ్‌ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఎంపీపీ రాజేశ్వరి కల్పించుకుని ప్రభుత్వ కార్యక్రమాల్లో సర్పంచ్‌లను భాగస్వాములను చేశామని, సర్పంచ్‌లను గౌరవించలేదనడం సరికాదన్నారు. పంచాయతీలకు కేటాయించిన రూ.5.65 కోట్లు ప్రభుత్వ గ్రాంటు అంటేనే తాము తీర్మానాలు ఇచ్చామని, మళ్లీ మ్యాచింగ్ గ్రాంట్ అని మాటమార్చడం సరికాదని సర్పంచ్‌లు కన్నయ్యనాయుడు, వెంకటరత్నం, నాగరాజు పీఆర్ ఏఈ నర్సింగరావును నిలదీశారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రజా సమస్యలను చర్చించేందుకు నెలకొకసారి జరిగే సమావేశానికి కొంతమంది అధికారులు డుమ్మా కొట్టడం సరికాదన్నారు. రైతు భరోసా, తల్లికి వందనం పథకాల కోసం ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారని దీనిపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. పొటాష్ లభించక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ రాంప్రసాద్ సభలో ప్రస్తావించారు. రోడ్ల మరమ్మతులు, కల్వర్టుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.75 కోట్లు మంజూరు చేసిందని ఆర్అండ్‌బీ ఏఈ నారాయణరెడ్డి తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ తాతబాబు, జెడ్పీటీసీ రమణమ్మ పాల్గొన్నారు.

పంచాయతీల నిధులు, అధికారాలు తెలుసుకోండి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పంచాయతీ విస్తరణాధికారి మూర్తి

నాతవరం : గ్రామ పంచాయతీలు ఆశించిన విధంగా అభివృద్ధి చెందాలంటే సర్పంచ్‌తో పాటు పాలక వర్గాల సభ్యులు అంకితభావంతో పని చేయాలని పంచాయతీ విస్తరణాధికారి ఎస్.ఎస్.వి.మూర్తి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం పంచాయతీ ఉప సర్పంచ్ ఇద్దరు వార్డు మెంబర్లు చొప్పున మండల వ్యాప్తంగా ఉన్న పంచాయతీల నుంచి సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నుంచి వచ్చే నిధుల పట్ల కనీస అవగాహన కలిగి ఉండాలని, పంచాయతీలో ఏవిధమైన పనులు చేయాలనే విషయాలు కూడా తెలుసుకోవాలన్నారు. గ్రామాల్లో వనరులు ఏవిధంగా సేకరించుకోవాలి ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు ఎలాంటి పనులకు ఖర్చు చేయాలి అనే విషయాలను వివరించారు. పంచాయతీలో గ్రామసభలకు ఉన్న విలువ సభ్యులకు ఉండే అధికారాలపై క్లుప్తంగా తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వివక్షకు తావు లేకుండా సమస్యలపై స్పందించాలి


తహసీల్దార్ వేణుగోపాల్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి, జిల్లా పార్టీ నాయకులు, సర్పంచులు

నాతవరం : నూతన తహసీల్దార్ ఎ.వేణుగోపాల్‌ను మంగళవారం ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు, సర్పంచ్‌లు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున స్థానికంగా ఉన్న తమ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు తమ దృష్టికి తీసుకువచ్చిన ప్రజా సమస్యలపై నిబంధనల ప్రకారం న్యాయం చేసేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని కొరారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి సబ్బవరపు వెంకునాయుడు, జిల్లా కమిటీ సభ్యుడు ఉలబాల శ్రీనివాస్, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, గునుపూడి సర్పంచ్ వేములు సూర్యనారాయణ, మాజీ ఉప సర్పంచ్ చిటికిల వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వేముల సూరిబాబు, పీకే గూడెం పీఏసీఎస్ డైరెక్టర్ అచ్చియ్యనాయుడు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండల శాఖ అధ్యక్షుడు చెక్కా జోగిరాజు ఉన్నారు.

అభ్యసనా వైకల్యం గల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ


కె.కోటపాడులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈవో సత్యనారాయణ

కె.కోటపాడు : చదువుల్లో వెనుకబడిన ప్రతి విద్యార్థి చదువులపై ప్రత్యేక శ్రద్ధను ఉపాధ్యాయులు చూపాలని మండల విద్యాశాఖాధికారి కె.సత్యనారాయణ అన్నారు. కె.కోటపాడు హైస్కూల్లో మంగళవారం పాఠశాలల్లో చదువులు సాగిస్తున్న విద్యార్థుల్లో అభ్యసనా వైకల్యాలపై అవగాహనా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో రాయడం, చదవడం, భావాలను వ్యక్తపర్చడం, తప్పుగా రాసే సమస్యను ఉపాధ్యాయులు గుర్తించాలని ఆయన సూచించారు. ఈ లక్షణాలు గల విద్యార్థులకు ప్రత్యేకంగా తరగతులను నిర్వహించి, అభ్యసనా లోపాలను అధిగమించేలా చర్యలను తీసుకోవాలని ఎంఈవో సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మావతి, సహిత విద్య ఉపాధ్యాయులు సీహెచ్.కన్నమ్మ, పరదేశి, మురళీకృష్ణ, బోకం ఎర్రునాయుడు, మల్లాది కామేశ్వరరావు, ఈశ్వరరావు, లక్ష్మి పాల్గొన్నారు.

కలాం ఆశయ సాధనకు కృషి చేయాలి


కె.కోటపాడులో అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేస్తున్న డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్


అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేస్తున్న వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు

కె.కోటపాడు : సామాన్యునిగా పుట్టి దేశ అత్యున్నత శిఖరాలను అధిరోహించిన వ్యక్తి మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అని అయ్యన్న ఇంగ్లిష్ మీడియం పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్ అన్నారు. పాఠశాలలో అబ్దుల్ కలాం 93వ జయంతి కార్యక్రమాన్ని మంగళవారం ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలను వేసి ఆయన ఔన్నత్యాన్ని విద్యార్థులకు ఖాసిమ్ వివరించారు. భారత్ దేశంలో పోఖ్రాన్ అణుపరీక్ష విజయవంతంలో కలాం పాత్ర ప్రముఖమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నూర్జహాన్ పాల్గొన్నారు.

నర్సీపట్నం : నేటి తరం యువత అబ్దుల్ కలాం ఆశయ సాధనకు కృషి చేయాలని వాకర్స్‌క్లబ్ ట్రెజరర్ అల్లు అప్పారావు అన్నారు. మంగళవారం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మున్సిపల్ స్టేడియంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ ఈశ్వరరావు, కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి పిట్ల శ్రీనివాసరావు, పీఆర్టీయు అధ్యక్షుడు అడిగర్ల వరహాలనాయుడు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


ఓడపాడు వద్ద రోడ్డు పనులు

మాడుగుల : మండలంలో ఘాట్‌రోడ్ జంక్షన్ నుంచి కింతలి రోడ్లకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో 9 కిలోమీటర్ల మేర తారు రోడ్డుతో పాటు ,గ్రామాల నడుమ సీసీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణాలకు అప్పటి మంత్రి, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు బూడి ముత్యాల నాయుడు రూ.9 కోట్ల నిధులు మంజూరు చేయించారు. దీంతో ఎన్నికల ముందు ఘాట్‌రోట్ జంక్షన్ నుంచి కింతలి వరకు తారు రోడ్డు పూర్తయింది. ఎన్నికల కోడ్ రావడంతో ఓడపాడు, జంపెన, గాదిరాయి. వొమ్మలి కాటా, జేడీపేట, కింతలి గ్రామాల నడుమ, సీసీ రోడ్డు పనులు పూర్తి కాలేదు. ఆయా పనులను మంగళవారం ఆర్ అండ్‌బీ అధికారులు ప్రారంభించారు.

రేపు మండల సమావేశం

రోలుగుంట : ఈ నెల 17న గురువారం మండల సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో నాగేశ్వరావు ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ యర్రంశెట్టి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులు తమ అభివృద్ధి కార్యక్రమాలకు చెందిన సమాచారంతో విధిగా హాజరుకావాలని పేర్కొన్నారు. ఆహ్వానితులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేటి నుంచి నట్టల నివారణ మందుల పంపిణీ

మాడుగుల : మండలంలో ఈ నెల 16 వ తేదీ నుంచి 31 వ తేదీ వరకు నట్టల నివారణ మందులు ఉచితంగా పంపిణీ జరుగుతుందని ఏడీ వి.చిట్టినాయుడు తెలిపారు. మేకలు, గొర్రెలు పెంపకందారులు స్థానిక రైతు సేవా కేంద్రాలతో పాటు పశు వైద్యశాలలను సంప్రదించి నట్టల నివారణ మందులు తీసుకోవాలన్నారు.

దేవరాపల్లి: గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును తప్పనిసరిగా తాగించాలని మండల పశువైద్యాధికారి కె. మంజుష సూచించారు. స్థానిక మండల పశువైద్యశాలలో మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బుధవారం నుంచి ఈ నెల 31 వరకు నట్టల నివారణ కార్యక్రమాన్ని చేపడుతున్నామని, గొర్రెలు, మేకల పెంపకదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రహదారుల అభివృద్ధికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల రూరల్ : గ్రామాల్లో అభివృద్ధిని ప్రాధాన్యతా క్రమంలో చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలో కె.జె.పురం, తాటిపర్తి, శంకరం గ్రామాల్లో మంగళవారం జరిగిన పల్లె పండగ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రూ.35 లక్షల ఉపాధి నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు నిధులను మంజూరు చేయనున్నట్టు హామీ ఇచ్చారు. దీపావళి నుంచి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లను అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టనున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రామానాయుడు, ప్రసాదరావు, సర్పంచ్ రమణబాబు, ఎంపీటీసీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతిపై పాలకుల సవతి ప్రేమ

- సీపీఐ జిల్లా సమితి సభ్యుడు వేచలపు కానుబాబు


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సమితి సభ్యుడు కాసుబాబు

కె.కోటపాడు : ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్ట్‌పై పాలకులు చిన్నచూపు చూస్తున్నట్టు సిపిఐ జిల్లా సమితి సభ్యుడు వేచలపు కాసుబాబు అన్నారు. కె.కోటపాడులో మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఉత్తరాంధ్ర ప్రజల జీవనాడి అయిన ప్రాజెక్టును పూర్తి చేసే చర్యలను తీసుకునేలా ప్రభుత్వంపై పాలకులు ఒత్తిడిని తీసుకురావాలని ఆయన కోరారు. ఈ ప్రాజెక్ట్ వల్ల ఉత్తరాంధ్రలో 18 నియోజకవర్గాల్లో 408 మండలాల్లో 1200 గ్రామాలకు పైగా గ్రామాల్లో 30 లక్షల మందికి తాగునీరు, ఎనిమిది లక్షల పంట పొలాలకు సాగునీరు అందే పరిస్థితి ఉంటుందని కాసుబాబు పేర్కొన్నారు. అత్యంత ప్రాముఖ్యత గల ఈ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్ట్‌ను పాలకులు కావాలనే వెనుకకు పెడుతున్నట్టు ఆయన ఆరోపించారు. రాబోయే బడ్జెట్లో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయింపులు జరిగేలా ప్రభుత్వంపై పాలకులు ఒత్తిడిని తీసుకువచ్చి, ఈ ప్రాంత ప్రజలకు తాగునీరు, సాగునీటిని అందించేలా చూడాలని కాసుబాబు కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు రెడ్డి అప్పలనాయుడు, మండల కార్యదర్శి గొర్లె దేముడుబాబు, వర్రి సన్యాసినాయుడు, రాము నాయుడు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

సచివాలయానికి ప్రారంభోత్సవం

మాడుగుల : మండలంలో శంకరం గ్రామంలో రూ.43 లక్షలతో సచివాయ భవనం వైఎస్సార్ సీపీ హయాంలో నిర్మాణం పూర్తయింది. అయితే ఎన్నికల కోడ్‌రావడంతో అప్పటిలో ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శొలం రమేష్, ఎంపీడీవో కొంకి అప్పారావు, నాయకులు అద్దేపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు, పుప్పాల రమేష్ పాల్గొన్నారు.

వరిలో తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి


రైతులతో సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి మోహనరావు

దేవరాపల్లి : ఖరీఫ్ వరి పంటలో తెగుళ్ల బెడద అధికంగా ఉన్నందున అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్ రావు రైతులకు సూచించారు. ఎ.కొత్తపల్లిలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. క్షేత్ర స్థాయిలో సందర్శించి వరి పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సలహాలు, సూచనలు అందించారు. వరి సాగు అడుగు పొట్ట లేదా పిగులు పొట్ట దశలో ఉన్నందున కచ్చితంగా పొలంలో రెండు లేదా ఐదు సెంటీమీటర్ల మేర నీరు ఉండేలా రైతు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొత్త రకం మినుములు, పెసలు, నువ్వులు, రాగి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల్లో ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వై.కాంతమ్మ, మండల వ్యవసాయ విస్తరణ అధికారి కిరణ్‌కుమార్, స్థానిక అగ్రికల్చర్ అసిస్టెంట్ దివ్య పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదులో తప్పులుంటే తెలపండి..

కె.కోటపాడు : ఈ నెల 7 వరకూ నిర్వహించిన ఈ–క్రాప్ నమోదులో రైతుల భూ విస్తీర్ణం, పంట రకంలు తప్పుగా నమోదు అయితే రైతు సేవా కేంద్రాల్లో గల వ్యవసాయశాఖ సిబ్బందికి రైతులు తెలియపర్చాలని అనకాపల్లి జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు తెలిపారు. వారాడ గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లాలో గల అన్ని రైతు సేవా కేంద్రాల్లోను ఈ నెల 17 వరకూ ఈ–క్రాప్ నమోదు వివరాలను అందుబాటులో ఉంచనున్నట్టు తెలిపారు. తెగుళ్ల నివారణకు వరిపంటకు రక్షణగా గట్టుపై ఎర్రపంటను వేయాలన్నారు. రబీలో వేరుశెనగ పంటను సాగు చేసే రైతులు రెండో గొప్పులో ఎకరానికి 200 కిలోల జిప్సం వేయాలని సూచించారు. తద్వారా దిగుబడి పెరిగి నూనెశాతం మెరుగ్గా ఉంటుందన్నారు. ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.వి.లక్ష్మి డ్రిప్‌కు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులకు వివరించారు. వర్షాకాలంలో పాడి రైతులు పశువులను పొడి ప్రాంతాల్లో ఉంచాలని కొరువాడ పశువైద్యాధికారి నాయుడు తెలిపారు. మండల వ్యవసాయాధికారి సోమశేఖర్, వ్యవసాయ విస్తరణాధికారి లైలాదేవి, సర్పంచ్ సౌజన్య, వైస్ ఎంపీపీ నాగవిజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సరోజిని పాల్గొన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

నాతవరం : ఈనెల 17వ తేదీ నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తామని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కలెక్టరు అదేశాల ప్రకారం మండలంలో గతంలో రీసర్వే జరిగిన పంచాయతీల్లో రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. రీసర్వేలో రైతులు తాలుకా భూముల్లో తప్పుఒప్పులు జరిగితే నేరుగా రెవెన్యూ గ్రామసభల్లో దరఖాస్తులు చేసుకోవచ్చున్నారు. అదే విధంగా ఏ విధమైన భూసమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. రెవెన్యూ గ్రామసభల్లో తమ దృష్టికి తీసుకువచ్చిన భూ సమస్యలను 15 రోజుల వ్యవధిలో పరిష్కరించడం జరుగుతుందన్నారు.

రోలుగుంట : భూ సర్వే జరిగిన రెవెన్యూ గ్రామాల్లో ఈ నెల 17 నుంచి నిర్వహించనున్న గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ శంకరరావు కోరారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెవెన్యూల వారీగా భూ రికార్డులతో ఈ సమావేశాలకు సంబంధిత అధికారులు పూర్తి సమాచారంతో హాజరవుతారన్నారు. సభల నిర్వహణకు సంబంధించి ఆయన ప్రకటించిన షెడ్యూల్ వివరాలిలా ఉన్నాయి.

ఈ నెల 17న బొట్టవాని గైరంపేట, 18న గంగవరం , 22న వై.బి.పట్నం, 23న చింతలపూడి, 25 న పనలపాడు, 26న అర్ల, 29న కొరుప్రోలు, 30న పెదపేట, వచ్చే నెల 2న బి.బి.పట్నం, 6 న గుర్రంపేట, 7న రత్నంపేట, 8న కంచుగుమల, 12న వెదుళ్లవలస, 13న బుచ్చింపేట, 15న కొండపాలెం, 16న రోలుగుంట గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ ఈ సభలు జరుగుతాయని తెలిపారు.

క్రీడలపై యువత ఆసక్తి చూపాలి


ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం : క్రీడలపై యువత మరింత ఆసక్తి చూపాలని ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు అన్నారు. మండలంలో గోవాడ గ్రామంలో జెడ్పీ హైస్కూల్‌లో ఉమ్మడి జిల్లాస్థాయి ఆటలు పోటీలు మంగళవారం జరిగాయి. ఫెన్సింగ్, బాల్ బాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలను ఎమ్మెల్యే రాజు ప్రారంభించారు. క్రీడల్లో మంచి నైపుణ్య కనబరచడం వల్ల ఉద్యోగ అవకాశాలు కూడా మెరుగుపడతాయన్నారు. అంతేకాకుండా విద్యతోపాటు క్రీడలు కూడా ఆడడం వల్ల మానసిక ఉల్లాసం, మంచి ఆరోగ్యం ఉంటుందన్నారు. ప్రభుత్వం క్రీడలకు సముచిత స్థానం కల్పిస్తుందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్, మాజీ సర్పంచ్ ఏడువాక లక్ష్మణకుమార్, స్కూల్ కమిటీ చైర్మన్ కుప్పిలి గణపతమ్మ పాల్గొన్నారు.